క్లుప్తంగా

17నుంచి ఉర్సు

రామన్నపేట: మండలకేంద్రంలోని మౌలా లిచిల్లా దర్గా ఉర్సు ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ముజావర్ జానీపాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న గంధం ఊరేగింపు, 18న ఉర్సు ఉత్సవాలు, 19న దీపారాధన చేయడం జరుగుతుంద న్నారు. ఉత్సవాలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరం బుధవారం కొనసాగింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మహిళా సాధికారతపై ఇంటింటా సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు దుర్గం సాయివర్ధన్, జ్యోతి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరమల్ల లింగస్వామిగౌడ్‌కు సన్మానం


లింగస్వామిని సన్మానిస్తున్న యువకులు

రామన్నపేట : మహారాష్ట్రలోని పూణే డాక్టర్ డీ.వై పాటిల్ విద్యాపీఠ్ యూనివర్సిటీనుంచి గౌరవ డాక్టరేట్ పొందిన కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వీరమల్ల లింగస్వామిగౌడ్‌ను బుధవారం స్థానిక యువకులు, 1996–97 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలఅధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, నాయకులు గోలి స్వామి, కోణాల మధు, బాలగోని కృష్ణగౌడ్, గోపగోని వెంకటరమణ, గోపాల్, భూషణం, తీర్పాల ఐలయ్య, ఎర్ర రమేష్, దాసరి నరసింహ, వీరమల్ల లింగస్వామి, జగన్, సైదులు, బాలగోని శ్రీనివాస్, నాగభూషణం, ఐలయ్య, శ్రీశైలం, బోయపల్లి రమేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


చెక్కు అందజేస్తున్న గ్రామస్తులు

మోత్కూరు : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన ఎలుగ రాంరెడ్డిని బుధవారం పలువురు గ్రామస్తులు పరామర్శించారు. వారు సేకరించిన రూ.1,18,116 ఆర్థికసాయం అందజేశారు.

రామన్నపేట : మండలంలోని సిరిపురం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యుడు కనుకుంట్ల నర్సిరెడ్డి కుటుంబానికి బుధవారం యూనియన్ నాయకులు పరామర్శించారు. యూనియన్ తరఫున రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

బాలనర్సయ్యకు నివాళి

గుండాల : మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దంతూరి బాలనర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, నాయకులు రాజరత్నం, వెంకన్న, రవి, చిందం ప్రకాష్, మల్లయ్య, మధు, సోమన్న పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

రాజాపేట : మండలంలోని కాల్వపల్లి గ్రామంలో ఇంజ నవీన్‌కు చెందిన పూరిల్లు దగ్ధమైన సంఘటన బుధవారం జరిగింది. వివరాల ప్రకారం నవీన్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాప్తించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ. 4లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

జాతరకు వెళ్లొచ్చేసరికి బంగారం చోరీ

భువనగిరిటౌన్: హన్మకొండ జిల్లా పరిధిలోని ఐనవోలు జాతరకు వెళ్లి వచ్చేసరికి ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు గొలుసు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన టీ. సునంద సంక్రాతి పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం ఐనవోలు మల్లన్న జాతరకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా.. 2 తులలాకు పైగా ఉన్న బంగారు గొలుసు కనిపించకుండా పోయింది. బాధితురాలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే గేట్ తిప్పలు ఇంకెన్నాళ్లు ?

- వంగపల్లి రైల్వే గేటు వద్ద వాహనదారులకు కష్టాలు
- గేటు పడిన ప్రతిసారి ఇరువైపులా నిలిచిపోతున్న ట్రాఫిక్
- ఫ్లై ఓవర్ నిర్మించాలని వేడుకోలు


యాదగిరిగుట్ట-వంగపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేట్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి – యాదగిరిగుట్ట మధ్య గల రైల్వే గేటుతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. ప్రతి అరగంటకోసారి ఒక రైలు వెళ్తుండడం.. గేటు వేసిన ప్రతి సారి 15 నిముషాల వరకు తీయకపోవడంతో అత్యవసరంగా వెళ్లే వాహనాలు కూడా గేటు తీసేవరకూ నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేట్ పడిన సమయంలో గేటుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి.

నిత్యం రద్దీగా..

హైదరాబాద్–వరంగల్ ప్రధాన జాతీయ రహదారి గుండా వచ్చే ప్రయాణికులు, వరంగల్ జిల్లా నుంచి వచ్చే వాహనదారులు, పాటుగా, చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు వంగపల్లి నుంచి యాదగిరిగుట్టకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు కార్యాలయాలకు, వివిధ పనుల నిమిత్తం ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేటప్పుడు గేటు పడిందంటే అంతే సంగతులు. అత్యవసర సమయాల్లో సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులకు సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. అయితే రైల్వే గేటుతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఆర్ఓ బ్రిడ్జి ఆర్వోబీ నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులు, ప్రతిపాదనలు చేశారు. 5 కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఈ రోడ్డుకు రూ. 28 కోట్లు అంచనా వేసి ప్రతిపాదనలు పంపించారు. రైల్వే అధికారులతో బ్రిడ్జీ నిర్మాణం కోసం చర్చలు జరిపారు. కానీ ఈ రోడ్డుకు, బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగిపోతాయి



వంగపల్లి–యాదగిరిగుట్ట మధ్యలో గల రైల్వే గేట్‌తో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాదగిరిగుట్టకు వెళ్లాలన్న, అంబులెన్స్, ఫైర్ సర్వీస్‌లు వంటి వాహనాలు గ్రామాలకు గేట్ దాటి రావాలన్నా రైల్వే గేట్ వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడి, సమయం వృథా అవుతుంది. ఈ మార్గంలో ఆర్ఓబీ బ్రిడ్జి నిర్మాణం చేపడితే, వాహనదారులకు అవస్థలు తొలగిపోతాయి. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ చర్యలు చేపట్టాలని కోరుతున్నాం

– తోటకూరి బీరయ్య, మాజీ సర్పంచ్, చొల్లేరు

ప్రతిపాదనలు వచ్చాయి

యాదగిరిగుట్ట–వంగపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేటు వద్ద ఆర్ఓబీ బ్రిడ్జీ నిర్మాణం చేపట్టాలని నెల క్రింద ప్రతిపాదనలు వచ్చాయి. నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్ పనులను చేయాల్సి ఉంది. ఆర్అండ్‌బీ, రైల్వే శాఖ అధికారుల సమన్వయంతో చర్చలు సాగించాలి. రాబోయే కొద్ది రోజుల్లోనే బ్రిడ్జి నిర్మాణం పనుల పట్ల కదలికలు వచ్చే అవకాశం ఉంది.

– జగన్నాథ్, జూనియర్ ఇంజనీర్, రైల్వే శాఖ

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి


ఎస్ఐని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

రామన్నపేట : సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఎస్ఐ పి.మల్లయ్య అన్నారు. బుధవారం సిరిపురం ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు ఎస్ఐని కలిసి గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన నగదు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో యూనియ న్ అధ్యక్షుడు మోటె మల్లయ్య, ఉపాధ్యక్షుడు గండికోట ఐలయ్య, కన్వీనర్ ఏళ్ల సంతోష్‌రెడ్డి, సభ్యులు సిల్వేరు సత్తయ్య, యాదయ్య, లింగస్వామి, పరమేష్, కృష్ణ తదితరులు పలువురు యూనిన్ నాయకులు పాల్గొన్నారు.

గోశాల కూల్చివేతపై డీజీపీ స్పందించాలి

భువనగిరిటౌన్ : ఆలేరు మండలం బహుదూర్‌పేట గ్రామంలోని శ్రీ సారబుడ్ల సావిత్రమ్మ లక్ష్మారెడ్డి గోశాలను కూల్చివేసిన ఘటనపై డీజీపీ స్పందించాలని రామరాజ్యం వ్యవస్థాపకుడు త్యాగరాజు బంటు వీర రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరి పట్టణంలోని రహదారి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోశాల కూల్చివేత ఘటనపై యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండలరావు, ఆలేరు ఎస్సై రజినీకర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. దోషులను శిక్షించాల్సిన పోలీసులు బాధితులను ప్రివెంట్ అరెస్టులు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలకు ప్రజలే ప్రభువులని ఆ విషయం పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. రామరాజ్యం సేనలతో తిరిగి గోశాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశం లో రామరాజ్యం ఇందూరు బాధ్యులు సాయినాథ్, నాయకులు జంపాల దశరథ, దయ్యాల సంపత్, పెరపు ఆనంద్,పాశికంటి సంపత్, కుండే గణేష్, లక్కాకుల రమేష్, పల్లె సత్యనారాయణ, కడగచ్ శ్రీనివాస్, రాయపురం భాస్కర్, లక్కాకుల శ్రీరామ్, చెక్క శేఖర్ తదితరులు ఉన్నారు.

పిల్లలతో పనిచేయిస్తున్న వారిపై కేసు నమోదు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లిలో చిన్నారులతో పని చేయిస్తున్న వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ స్మైల్ అధికారులు యాదగిరిపల్లిలోని రాయచాందిని అగర్వాల్ డెవలపర్స్ సంస్థ చేపట్టిన భవన నిర్మాణం వద్ద 16 సంవత్సరాలు వయస్సున్న ముగ్గురు పిల్లలు పనిచేస్తున్నట్లు మంగళవారం గుర్తించారు. పిల్లలను పనిలో పెట్టుకొని వెట్టిచాకిరి చేయిస్తుండటంతో రాయ చాందిని అగర్వాల్ డెవలపర్స్ సంస్థ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ పేర్కొన్నారు.

చేనేత సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయించాలి

ఆత్మకూరు(ఎం): చేనేత సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయించాలని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు యలగందుల మహేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఉన్న చేనేత పథకాలను అమలు చేస్తూ ఉత్వర్వులు జారీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరావు, విప్ బీర్ల అయిలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సంస్థాన్‌నారాయణపురం : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వలిగొండ : మండలంలోని వేములకొండలోని ప్రభుత్వ పాఠశాల 2009–10 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల నరేష్, జక్కల నవీన్, బోడ సాయినాథ్, చంద్రగిరి సతీష్, అమనగంటి మహేష్, ఇంజమూరి అశోక్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని గుజ్జ గ్రామంలో జెడ్పీ పాఠశాల 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం చౌటుప్పల్ తంగేడు వనంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అందరూ ఒక చోట కలుసుకొని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.


వలిగొండ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది


భూదాన్‌పోచంపల్లి : ట్రోఫీ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి


ఆత్మకూరు(ఎం): సింగారంలో ప్రథమ బహుమతి అందుకున్న నేతాజీ యువజన మండలి జట్టు

సంస్థాన్ నారాయణపురం : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎన్‌పీఎల్ సీజన్– 2 మునుగోడు నియోజకవర్గం స్థాయి వాలీబాల్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నర్రి నరసింహ, చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నారాయణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ గడ్డం మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గడ్డం పెంటయ్య, లారీ భిక్షం, భిక్షం, పాండురంగ నాయక్, కొండ శ్రీను, గంగాదేవి సత్తయ్య సిద్ధగోని శీను పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో నేతాజీ యువజన మండలి, శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడా కారులకు బహుమతులు అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

వలిగొండ : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ నాయకుడు చేగూరి మల్లేశం అన్నారు. మండలంలోని టేకులసోమారంలో నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారం ముగివాయి. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో ప్రథమ బహుమతి రేఖల శశాంక్ టీమ్, ద్వితీయ బహుమతి సర్వాయి పాపన్న యూత్, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి రేఖల శశాంక్, ద్వితీయ బహుమతి అంబేద్కర్ యూత్ జూనియర్ టీమ్, ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి మీసాల స్రవంతి, ద్వితీయ బహుమతి నంది, తృతీయ బహుమతి చేగూరి సౌందర్యలకు బహుమతులు అందజేశారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : యువత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని కనుముకుల గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ కుక్క దానయ్య, కోట రాంచంద్రారెడ్డి, ఐలయ్యయాదవ్, పాక జంగయ్య, చుక్క శంకరయ్య, దోటి కుమార్, రమణారెడ్డి, లింగస్వామి, మహిపాల్‌రెడ్డి, కూసుకుంట్ల మహిపాల్ రెడ్డి, బాబు, ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 4 వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉండడంతో బుజిలాపురం, కొండగడప, విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశం లేకుండా పోయిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేద కూలీలకు వర్తించకుండా ఉపాధి హామీ జాబ్ కార్డు లింకు పెట్టడం సరి కాదన్నారు. ఆయన వెంట సీపీఎం మండల నాయకులు పసునూరి చంద్రారెడ్డి, దడిపల్లి ప్రభాకర్, కురుమేటి యాదయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


భువనగిరి : ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


భువనగిరి : ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్


భూదాన్‌పోచంపల్లి : బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


అడ్డగూడూరు : బహుమతులు అందజేస్తున్న నాయకులు


యాదగిరిగుట్ట : గోవుకు పూజలు చేస్తున్న యువకులు

భువనగిరి : భువనగిరి పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి, గురువారం కనుమ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.వాసవీ క్లబ్ భువనగిరి ఆధ్వర్యంలో శబరి నగర్‌లోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గో పూజ నిర్వహించారు. అనంతరం సోమేశ్వర్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్ సహకారంతో గోవులకు దాన అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బచ్చు రమేష్, కోశాధికారి జంగాల హనుమంతరావు, రీజియన్ చైర్మన్ పాలకుర్తి వేణు మాధవ్, మాజీ అధ్యక్షుడు రిషికేష్, వెంకటేశ్వర్లు, చీకటిమల్ల రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆజాద్ రోడ్డులో సంక్రాంతి పండుగ సందర్భంగా బీజేపీ నాయకులు కోల్లోజు సతీష్ గంగిరెద్దులకు వస్త్రాలను అందజేశారు.

మండలంలో..

మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ ర్యాకల సంతోష్‌శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు.అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మారపు సురేష్, వార్డు సభ్యులు పల్లెపాటి బాలమణి, గంజి సందీప్, కిరణ్, అరుణ్, రమేష్, బాలరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే వడాయి గూడెం గ్రామంలో దుర్గమాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలను జరుపుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ గుండు మనీష్‌గౌడ్, ముత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంపల్లి కృష్ణ, ఉత్సవ కమిటి గౌరవ అధ్యక్షుడు కల్లెం కృష్ణ బబ్బూరి సురేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నీల అందజేయులు, మాజీ సర్పంచ్‌లు కోట పెద్దస్వామి, రాజన్, మాజీ ఉప సర్పంచ్‌లు సుక్కల మల్లయ్య, సభ్యులు రవి, చంద్రయ్య,కల్లెం సాగర్, శంకర్, చంద్రశేఖర్, నందు, నర్సింహ, పోశయ్య, స్వామి దాసు, భిక్షపతి పాల్గొన్నారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అ ందజేశారు.

రాజాపేట : మండలవ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ఎదుట ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చిన్నారులు ఆనందోత్సవాలతో గాలిపటాలు ఎగురవేశారు.

యాదగిరిగుట్ట: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇంటి ముందు రంగు రంగుల ముగ్గుల వేసి గొబ్బెమ్మలను పెట్టి రేగు పండ్లు పోసి వేడుకను జరుపుకున్నారు. వ్యవసాయ బావుల వద్ద రైతులు గోమాతలకు పూజలు చేశారు.

రామన్నపేట : మండలవ్యాప్తంగా సంక్రాంతి పర్వదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇంటిముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి నవధాన్యాలతో పూజించారు. గంగిరెద్దుల విన్యాసాలను తిలకించి కొత్త చీరలను బహుకరించారు. గ్రామాల్లో హరిదాసులు సందడి చేశారు. హరిదాసులకు ధాన్యం, ధనం దానం చేశారు. యువకులు పోటాపోటీగా పతంగులు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. పలు గ్రామాల్లో ముగ్గులు, వాలీబాల్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

గుండాల : మండలవ్యాప్తంగా సంక్రాతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఆత్మకూరు(ఎం): మండలవ్యాప్తంగా సంక్రాంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటి ముందు రంగు, రంగుల ముగ్గులను వేశారు. ఆవు పేడతో గొబ్బెమ్మలను తయారు చేసి పసుపు, కుంకుమలతో, నవధాన్యాలతో పూజించారు.

ఆలేరురూరల్ : మండలవ్యాప్తంగా సంక్రాంతి పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. పిల్లలు పతంగులు ఎగరవేశారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని లక్ష్మణ్‌నగర్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కండేశ్వరస్వామి దేవాలయకమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, అసోషియేషన్ అధ్యక్షుడు గంజి బస్వలింగం, ఉపాధ్యక్షుడు భోగ విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి గుర్రం కృష్ణ, కార్యదర్శి చక్రాల నర్సింహ, కోశాధికారి బోగ శేఖర్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి వనం వెంకటేశం, ఈపూరి బాలయ్య, గుండు బాల్‌నర్సింహ, సీత పాండు పాల్గొన్నారు.

సంస్కృతి,సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక

అడ్డగూడూరు : సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీక అని మెర్సీ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ చైర్మన్ ఇటికాల చిరంజీవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోయూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల విజేతలకు లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్యయాదవ్, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నింజన్ రెడ్డి, విద్యాసాగర్, సోమయ్య, నిమ్మనగోటి జోజి, సత్యనారాయణ, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

రామన్నపేట : మండల పరిధిలో గల చిట్యాల–భువనగిరి రోడ్డు మార్గంలో గల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూలమలుపుల వద్ద కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. మలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్లతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రోడ్డుపై వాహనదారులు ప్రయాణం చేయాలంటేనే అరచేతిలో ప్రాణం పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికై నా అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


చిట్యాల-భువనగిరి మార్గంలో ఐడియల్ కంపెనీ వద ఉన్న మూలమలుపు


గుర్జాలబావి వద్ద..


డిగ్రీకళాశాల సమీపంలో..


ఇంద్రపాలనగరం అయ్యప్ప దేవాలయం సమీపంలో..